సాక్షి సూర్యాపేట

మంగళవారం ၊ 14 ၊ ఫిబ్రవరి ၊ 2023



బీజేపీకి పతనం తప్పదు

ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించకుండా మోసం చేస్తున్న బీజేపీకి పతనం తప్పదని పలువురు నేతలు అన్నారు. - 8లో



మార్చినాటికి సాగు లక్ష్యం పూర్తి

ఆయిల్‌పామ్ సాగులక్ష్యాన్ని మార్చినాటికి పూర్తి చేయాలని జిల్లా ఉద్యాన అధికారి శ్రీధర్ గౌడ్ కోరారు. - 8లో

గరిష్టం/కనిష్టం 34°/13°

వాతావరణం

ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌లో 11 ఫిర్యాదులు

సూర్యాపేట క్రైం: పోలీస్ గ్రీవెన్స్‌డేలో 11 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డేలో ఆయన పాల్గొన్నారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం ప్రతీ సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. కుటుంబ తగాదాలు, భార్యాభర్తల గొడవల వల్ల పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందన్నారు. భవిష్యత్‌లో పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగలేరన్నారు.

కందులకు రికార్డు ధర

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో కందులకు సోమవారం రికార్డు ధర పలికింది. వివరాలను మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ వెల్లడించారు. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు 413 బస్తాల కందులు రాగా క్వింటాకు గరిష్టంగా రూ.7,559 రేటు పలికినట్లు చెప్పారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఈ ధర వచ్చినట్లు చెప్పారు. మార్కెట్‌కు ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 9800 క్వింటాళ్ల కందులు వచ్చినట్లు తెలిపారు.

26న రెడ్ల ఆత్మీయ సభ



రెడ్ల ఆత్మీయ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్‌రెడ్డి

పెన్‌పహాడ్: రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 26న నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయం వద్ద ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో రెడ్ల ఆత్మీయ సభ నిర్వహించనున్నట్లు రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని అనంతారం గ్రామంలో రెడ్డి జాగృతి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. రెడ్డి కార్పొరేషన్ సాధన లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ. 5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. నిరుపేద రెడ్డి విద్యార్థులకు విదేశీ విద్యానిధితో తోడ్పాటు అందించడంతో పాటు రెడ్డి గురుకులాలు ఏర్పాటు చేయాలని కోరారు. 60 సంవత్సరాలు నిండిన ప్రతి రెడ్డి రైతుకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెమ్మికల్ సభకు రెడ్డి కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చివిజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురుకంటి నర్సిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడవెల్లి రంగారెడ్డి, మండల అధ్యక్షులు గార్లపాటి లింగారెడ్డి, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మొగుళ్ల వెంకట్‌రెడ్డి, సామ సురేందర్‌రెడ్డి, ఒంటెద్దు ఆదర్శరెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, మలిగిరెడ్డి, సైదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిట్టెపు వీరారెడ్డి, పాంతటి మల్లారెడ్డి, సామ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్

సూర్యాపేటటౌన్ : ఈ నెల 15 నుంచి మార్చి 2వ తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జానపాటి కృష్ణయ్య తెలిపారు. సోమవారం డీఐఈఓ కార్యాలయంలో డీఓ, సీఎస్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 44 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలో మొత్తం 7886 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. 15 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 17మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించినట్టు పేర్కొన్నారు. ఇద్దరు డీఈసీ సభ్యులు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమావేశంలో డీఈసీ సభ్యులు యాదయ్య, సైదులు పాల్గొన్నారు.

వెల్లటూరు లిఫ్ట్ నిర్మాణాన్ని నిలిపివేయాలి



డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

హుజూర్‌నగర్: వెల్ల టూరు లిఫ్ట్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని పలువురు రైతులు కోరారు. వెల్ల టూరు లిఫ్ట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ హుజూర్ నగర్, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాలరైతులు సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డీఏఓ కమలాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లిఫ్టువల్ల విలువైనభూములను రైతులు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనర్సింహారెడ్డి, వెంకటరెడ్డి, బి.శ్రీనివాస రెడ్డి, వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస రెడ్డి, సత్యనారాయణ, బ్రహ్మచారి, మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ పరిశీలన

- ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందుతున్న 89మంది సీనియారిటీ జాబితాలో లోపాలు
- తప్పులు, చేర్పులు, మార్పులపై టీచర్ల నుంచి అభ్యంతరాలు
- ప్రత్యేక బృందాలతో ఒరిజినల్ సర్టిఫికెట్ల పునః పరిశీలన



సూర్యాపేట టౌన్: ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు వచ్చాయి. దీంతో అధికారులు ప్రత్యేక పరిశీలన బృందాలను ఏర్పాటు చేసి ఒరిజినల్ ధ్రువపత్రాలను మరో మారు పరిశీలించారు. మల్టీజోన్ పరిధిలో ప్రధానోపాధ్యాయుల పోస్టులకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు కల్పించనున్నారు. అయితే ఇప్పటికే స్థానిక సంస్థల యాజమాన్యాలు, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో మొత్తం 89 మంది స్కూల్ అసిస్టెంట్‌లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించేందుకు సీనియారిటీ జాబితా వెల్లడించారు. ఈ జాబితాలో పలు లోపాలు ఉన్నట్టు అభ్యంతరాలు వచ్చాయి. వాటికి సంబంధించిన వివరాలను మరోసారి పరిశీలించారు. ఇందుకోసం డీఈఓ కార్యాలయంలో ప్రత్యేక పరిశీలన బృందాలను ఏర్పాటు చేశారు. జాబితాలోని ఉపాధ్యాయులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, సర్వీస్ రికార్డులతో ఆదివారం హాజరయ్యారు. వీరి ధ్రువపత్రాలను పరిశీలించి ఆర్‌జేడీకి పంపించినట్టు జిల్లా విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు.

అభ్యంతరాల స్వీకరణ..

సీనియారిటీ జాబితాలోని వివరాల్లో తప్పులు, చేర్పులు, మార్పులపై అభ్యంతరాలను స్వీకరించారు. డీఎస్సీ ర్యాంకులు, మార్కులు, నియామక తేదీలు, ఉద్యోగంలో చేరిన తేదీలు వంటి వాటిలో పొరపాట్లు దొర్లడంతో సీనియారిటీలో వారి కంటే వెనుక నిలవాల్సిన వారు జాబితాలో ముందు కొచ్చారని కొందరు అభ్యంతరం చెప్పారు. పొరుగు జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన వారి సర్వీసును ఇక్కడ విధుల్లో చేరిన తేదీని పరిగణనలోకి తీసుకోలేదని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు.

నాట్ విల్లింగ్ ఆప్షన్ కల్పిస్తేనే ప్రయోజనం..

పదోన్నతిపై ప్రధానోపాధ్యాయుల పోస్టులను తీసుకునే విషయంలో పలువురిలో అనిశ్చితి నెలకొంది. మల్టీజోన్ పరిధిలో ఈ పోస్టులను పదోన్నతి ద్వారా పొందే అవకాశముండడంతో కొందరు స్కూల్ అసిస్టెంట్‌లు దీనిని వదులుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న జిల్లాను వదిలి దూరంగా ఉన్న జిల్లాకు పదోన్నతిపై పోస్టింగ్‌ను పొంది పని చేసేందుకు మరికొందరు ఆసక్తి చూపుతున్నారు. ఈ అవకాశాన్ని వదులుకునేందుకు సిద్ధమవుతున్న వారికి నాట్ విల్లింగ్ అవకాశాన్ని కల్పించడం లేదని పేర్కొంటున్నారు. పదోన్నతి పొందిన వారు కూడా ప్రధానోపాధ్యాయుడి పోస్టులో విధుల్లో చేరని కారణంగా అది ఖాళీగా మిగులుతుందని పలువురు ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. నాట్ విల్లింగ్ ఆప్షన్‌ను ప్రభుత్వం కల్పిస్తే పదోన్నతిని కోరుకునే మరికొందరికి ప్రయోజనంగా ఉంటుందని చెబుతున్నారు.

ప్రజావాణికి హాజరుకాని అధికారులపై చర్యలు

- కలెక్టర్ వెంకట్రావు



2కే వాక్ థాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజావాణికి హాజరు కాని జిల్లా అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.వెంకట్రావు హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్ ఆన్‌లైన్ ద్వారా సంబంధిత మండల అధికారులతో మాట్లాడి వారి సమస్యలను వివరించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రజావాణి సందర్భంగా ఆయా మండలాల అధికారులు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాటిల్ హేమంత కేశవ్, జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఎస్. మోహన్ రావు, డీఆర్‌ఓ రాజేంద్ర కుమార్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు

సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశం మందిరంలో బ్యాంకర్లు, సెర్ప్ , శ్రీనిధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు సొంతంగా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకొని విద్యుత్ ఖర్చును తగ్గించుకోవడానికి, పర్యావరణ పరిరక్షణకు సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మొట్టమొదటగా జిల్లాలో శ్రీనిధి ద్వారా సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. శ్రీనిధి రుణాల లక్ష్యాన్ని పూర్తిచేయాలని, అలాగే బకాయిలను తిరిగి కట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. మునగాల, గరిడేపల్లి, మోతె మండలాల్లో బకాయిలను తిరిగి కట్టడంలో అలసత్వం వహిస్తున్నారని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకు లింకేజీ రుణాలు రూ. 715 కోట్లు టార్గెట్ కాగా గ్రూపులకు రూ. 560 కోట్లు రుణాలు మంజూరు చేశారని, ఇంకా రూ. 146 కోట్లు మార్చి 31 నాటికి పూర్తి చేయాలని కోరారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల కోసం జిల్లాకు 210 యూనిట్లు లక్ష్యంకాగా వీటిని వారం రోజుల్లో యూనిట్లను గ్రౌండ్ చేయాలని సూచించారు. అనంతరం సౌర విద్యుత్ యూనిట్ ఏర్పాటుకు శ్రీనిధి రుణాలు అన్న అంశానికి సంబంధించిన వాల్‌పోస్టర్, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) పాటిల్ హేమంత్ కేశవ్, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, శ్రీనిధి డీజీఎం బీవీఎస్ రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ చింతల బాపూజీ, ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ జి. తిరుపతయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలి

సమాజంలో ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలని కలెక్టర్ యస్.వెంకట్రావు అన్నారు. ఆర్బీఐ ఫైనాన్షియల్ లిటరసీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని బతుకమ్మ చౌరస్తా నుంచి గాంధీ పార్క్ వరకు లీడ్ బ్యాంక్ మేనేజర్ చింతల బాపూజీ అధ్యక్షతన చేపట్టిన 2కే వాక్ థాన్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు ఉద్యోగులు వినియోగదారులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. దేశంలో డిజిటల్ లావాదేవీల్లో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. గతంలో బ్యాంకు లోన్లు పారిశ్రామిక వేత్తలకు మాత్రమే అందుబాటులో ఉండేవని ప్రస్తుతం సామాన్యులు, రైతులకు ప్రతి ఒక్కరికి వస్తున్నాన్నారు. బ్యాంకులు అందిస్తున్న రుణాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని సకాలంలో చెల్లించి అభివృద్ధిలోకి రావాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ చింతల బాపూజీ మాట్లాడుతూ ప్రజల కోసమే బ్యాంకులు పనిచేస్తున్నాయని బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్‌ఎం టి. కృష్ణమోహన్, డీఎస్పీ నాగభూషణం, డీఎఫ్‌ఓ సతీష్, మున్సిపల్ కమిషనర్ పి. రామానుజుల రెడ్డి, ఏడీఏ రామారావు, వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

కంటి వెలుగును వినియోగించుకోవాలి

కంటి వెలుగు శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో రెండు రోజులపాటు కంటివెలుగు శిబిరం కొనసాగుతుందని, కలెక్టరేట్‌లోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది తమ తమ కుటుంబ సభ్యులతో 18 సంవత్సరాలు నిండిన వారంతా ఆధార్ కార్డు తీసుకొని వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం, వైద్యులు పాల్గొన్నారు.

ప్రేమ బంధం నిలవాలి కలకాలం

- ప్రేమ విఫలమై తనువు చాలిస్తున్న యువతులు
- ప్రేమ కేసుల్లో ఎక్కువగా మైనర్లే..
- అవగాహన లేకపోవడమే కారణమంటున్న పోలీసులు
- అవగాహనతో ఒక్కటవుతున్న కొన్ని ప్రేమ జంటలు



సూర్యాపేట క్రైం : ప్రేమ పేరుతో జిల్లాలో ఏదో చోట యువతులు మోసపోతున్నారు. కొందరు ప్రేమ పేరుతో మోసం చేస్తూ యువతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇంకొందరు పెళ్లి చేసుకుంటామని నమ్మబలికి పెళ్లికి నిరాకరిస్తున్నారు. ఇలా సూర్యాపేట జిల్లాలో కొంత మంది యువతులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. కేసులను పరిశీలిస్తే ఎక్కువగా ప్రేమించి పెళ్లి చేసుకోవడానికి నిరాకరించారంటూ పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు.

తెలిసీ తెలియని వయసులో ప్రేమలో పడి

జిల్లా వ్యాప్తంగా మూడేళ్ల కాలంలో నమోదైన కేసులను పరిశీలిస్తే.. ఎక్కువగాబాలబాలికలే అధికంగా ఉన్నారు. మేజర్లు కూడా ఉన్నప్పటికీ.. కొందరు అర్థం చేసుకుని.. వివాహం చేసుకోగా.. మరికొందరు మేజర్లు సైతం అపార్థం చేసుకుని ప్రేమించిన అమ్మాయిని దూరం చేసుకుంటూ కేసుల పాలవుతున్నారు. తెలిసీ తెలియని వయసులో ప్రేమలో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు యువతులు ప్రేమలో మునిగిపోయి పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకున్నప్పటికీ.. యువకులు మాత్రం వారిపై ప్రేమ చూపలేక.. ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రేమ పెళ్లిలు చేసుకుని రెండుమూడు నెలలకే పోలీస్ స్టేషన్ల మెట్లెక్కుతున్నారు. అయితే ఎలాంటి అపార్థాలకు ఆస్కారం ఇవ్వకుండా ఒకరికొకరు అర్థం చేసుకుంటే జీవితం సాఫీగా సాగుతుంది.

ప్రేమ కాదు.. వ్యామోహమే

ఇటీవల కాలంలో ప్రేమ పేరుతో మైనర్లు, మేజర్లు మోసపోతున్నారు. మేమిద్దరం ప్రేమించుకుంటున్నామంటున్నారు..కానీ అది ప్రేమ కాదు.. వ్యామోహమే. సఖి కేంద్రానికి వచ్చే యువతులు ఎక్కువగా గంజాయి, మద్యానికి బానిసైన వారినే ఇష్టపడడం చూస్తున్నాం. యువతులకు సఖి కేంద్రంలో అవగాహన కల్పిస్తున్నాం. జీవితంలో ప్రేమ కంటే ముందు బాగా చదువుకుని స్థిరపడాలన్న దానిపైనే ఎక్కువగా అవగాహన కల్పిస్తున్నాం.

– సేహెచ్ హేమలత, సఖి కేంద్రం ఇన్‌చార్జ్, సూర్యాపేట

రోజురోజుకూ పెరుగుతున్న ప్రేమ కేసులు

ప్రేమ పేరుతో మోసపోతున్న యువతులు అధికంగానే ఉన్నారు. రోజు ఏదో ఓ చోట ప్రేమ పేరుతో మోసపోతూ పోలీస్ స్టేషన్ల మెట్లు ఎక్కుతున్నారు. జిల్లాలో గత సంవత్సరం ప్రేమ పేరుతో మోసపోతున్న కేసులే అధికంగా ఉన్నాయి. ఇటీవల కాలంలో కిందిస్థాయి తరగతి చదివే విద్యార్థుల నుంచే ప్రేమలో పడుతున్నారు. స్టేషన్లతో పాటు షీ టీమ్ బృందాలు సైతం అలాంటి వారిపై ప్రత్యేక నిఘా పెట్టి అవగాహన కల్పిస్తున్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి



తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తల్లిదండ్రులు పిల్లలతో ప్రేమగా మెలిగితే ప్రేమ వైపు అడుగులు వేసే పరిస్థితి తక్కువగా ఉంటుంది. పిల్లలకు ఎక్కువగా చదువుతో పాటు ఇతర వ్యక్తులతో ఎలా మెలగాలో కూడా చెప్పాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా తల్లిదండ్రులు పిల్లలతో మంచి మిత్రులుగా ఉన్నప్పుడు వారికి వేరే వారి నుంచి ప్రేమ ఆశించాల్సిన అవసరం ఉండదు.

– ఎస్ రాజేంద్రప్రసాద్ ఎస్పీ, సూర్యాపేట

మైనర్లే అధికంగా ఉన్నారు

ప్రేమ కేసుల్లో ఎక్కువగా మైనర్లే ఉంటున్నారు. రెండు వైపులా కూడా మైనర్లు కావడంతో అవగాహన కల్పించి పంపిస్తూ.. పోక్సో కేసులు నమోదు చేస్తున్నాం. మేజర్లు కూడా పూర్తిస్థాయిలో ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడంతో కేసులు పెట్టుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రేమ పెళ్లిళ్లు చేసుకున్న వారు సైతం రెండు మూడు నెలలకే స్టేషన్ల మెట్లు ఎక్కుతున్నారు. జీవితంలో స్థిరపడ్డాకే ప్రేమ పెళ్లిళ్లకు మొగ్గు చూపడం మంచిది.

– జి.రాజశేఖర్, సీఐ

సూర్యాపేటలో జంక్షన్ల ఆధునీకరణకు రూ.2కోట్లు

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



జంక్షన్‌ను పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో జంక్షన్ల ఆధునీకరణకు రూ.2కోట్లు మంజూరైనట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి వెల్లడించారు.సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ పార్క్, పీఎస్‌ఆర్ సెంటర్, రాజీవ్ జంక్షన్, రాఘవ ప్లాజా జంక్షన్‌లను ఆయన పరిశీలించారు. జంక్షన్ల ఆధునీకరణపై మున్సిపల్ అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ సమీపంలోని ఎన్టీఆర్ పార్క్ చౌరస్తా సూర్యాపేట ముఖ ద్వారం కాబట్టి విశాలంగా సృజనాత్మకత ఉట్టి పడేలా తీర్చిదిద్దాలన్నారు. జంక్షన్‌ల ఆధునీకరణ పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. 2014 తరువాత అభివృద్ధిలో దూసుకుపోతున్న సూర్యాపేట పట్టణం జంక్షన్ల ఆధునీకరణతో నూతన శోభను సంతరించుకోనుందన్నారు.

శివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలి

మహా శివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని మంత్రి జగదీశ్ రెడ్డి కోరారు. సోమవారం పేటలో పిల్లలమర్రి శివాలయాల మహా శివరాత్రి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జెర్రిపోతుల భిక్షం, బచ్చలికూరి శ్రీనివాస్, లింగస్వామి, రాపర్తి శ్రీనివాస్, బి. శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మానాన్నల మనస్సు గెలవాలి

అవగాహనతో ప్రేమ పదిలం

- ప్రేమ పేరుతో చదువును నిర్లక్ష్యం చేయొద్దు
- కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
- 'సాక్షి' డిబేట్‌లో ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల మనోగతం



'సాక్షి' డిబేట్‌లో పాల్గొన్న ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

సూర్యాపేట టౌన్ : 'ప్రేమ వివాహం చేసుకోవడం వల్ల ఎన్నో కష్టాలు, నష్టాలు అనుభవించాల్సిన పరిస్థితి జీవితంలో ఏర్పడుతుంది.. పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకోవడం ద్వారా జీవితం సాఫీగా సాగుంది.. అయితే ప్రేమ వివాహం చేసుకోవాలనుకుంటే ముందు అమ్మానాన్నల మనస్సు గెలవాలని, ప్రేమ పేరుతో చదువును నిర్లక్ష్యం చేయవద్దు' అని అంటున్నారు చాలా మంది విద్యార్థులు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'పెళ్లికి ముందు ప్రేమ – పెళ్లి తర్వాత ప్రేమ' అనే అంశంపై సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో సాక్షి ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన డిబేట్‌లో వారు తమ మనోగతాన్ని వెల్ల డించారు. జీవితంలో ఉన్నత చదువులు చదివి స్థిరపడ్డాక తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్లి చేసుకోవడం ద్వారా అటు అమ్మానాన్నను సంతోష పెట్టడంతో పాటు ఇటు తామూ ఓ స్థాయిలో ఉండొచ్చన్నారు. ముందు మన తల్లిదండ్రులను లవ్ చేయాలన్నారు. తల్లిదండ్రులు తమపై ఎన్నో ఆశలు, ఆశయాలు పెట్టుకొని చదివిస్తున్నారని, వాటిని వమ్ముచేసి లవ్ అనే ట్రాక్‌లో పడి జీవితంలో మోసపోవద్దన్నారు.మరికొందరు విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..



మనసులు కలిసిన మనువు | 8లో

పెళ్లి చేసుకున్నాకే ప్రేమిస్తే బాగుంటుంది



ప్రస్తుత రోజుల్లో లవ్ అంటే ఫ్యాషన్ అయిపోయింది. లవ్ పేరుతో మోసం చేస్తున్నారు. డబ్బును చూసి కొంత మంది లవ్ చేస్తున్నారు. అలా కాకుండా మనసు చూసి లవ్ చేస్తే బాగుంటుంది. అయినా పెద్దలు కుదిర్చిన పెళ్లి తర్వాత ప్రేమిస్తేనే బాగుంటుంది.

– ప్రశాంత్, విద్యార్థి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల

అరేంజ్డ్ మ్యారేజ్ బెటర్



పెద్దలు కుదిర్చిన మ్యారెజ్ చేసుకున్నాకే లవ్ చేస్తే బెటర్. అలా కాకుండా తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టి వారికి నచ్చకుండా లవ్ చేసి పెళ్లి చేసుకుంటే పేరెంట్స్ బాధపడతారు. అలా కాకుండా వారిని బాధపెట్టకుండా అరేంజ్డ్ మ్యారేజ్ తర్వాత లవ్ చేస్తే బెటర్.

– మణికంఠ, విద్యార్థి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల

పెళ్లి తర్వాత ప్రేమ బాగుంటుంది



ఫస్ట్ తల్లిదండ్రులను లవ్ చేయాలి. ఆ తర్వాత మరెవరైనా. పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవడం ద్వారా మన జీవితం సాఫీగా నడుస్తుంది. పెళ్లి తర్వాత కూడా ప్రేమించుకోవచ్చు. ఒకరినొకరు అర్థం చేసుకొని జీవితంలో ఏదైనా సాధించవచ్చని నా అభిప్రాయం.

– కౌశిక్, ఈఈఈ విద్యార్థి, ఎస్వీ ఇంజనీరింగ్‌కళాశాల

లైఫ్‌లో కెరీర్ చూసుకోవాలి



చదువుకునే సమయంలోనే లవ్ పేరుతో కెరీర్‌ను పాడు చేసుకోవద్దు. లైఫ్‌లో ఫస్ట్ మన కెరీర్‌ను చూసుకోవాలి. జీవితంలో ఉన్నత స్థానంలో నిలిచి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలి. తల్లిదండ్రులు కుదుర్చిన పెళ్లి చేసుకోవడం ద్వారా ఉన్నత స్థానంలో ఉండొచ్చు.

– నాగసంతోషి, ఈఈఈ విద్యార్థిని, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల

చదువుతోనే ఏదైనా సాధ్యం..



జీవితంలో ఏదైనా సాధించాలంటే ముందు చదువు అవసరం. చదువుతోనే లైఫ్‌లో ఏదైనా సాధించవచ్చు. చదువుకునే సమయంలో ప్రేమ పేరుతో జీవితాన్ని ఆగం చేసుకోకుండా కష్టపడి చదివి ఉన్నత స్థానంలో ఉన్నాక లవ్ గురించి ఆలోచించాలి. ఉన్నత స్థానంలో ఉన్నాక ముందు లవ్ చేసుకున్నాకైనా పెళ్లి చేసుకున్నా ఇబ్బందులు రావు. పెళ్లి తర్వాత కూడా భార్యభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకొని ప్రేమించుకోవచ్చు.

– ప్రీతి, సెకండియర్ విద్యార్థిని, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల

జీవితంలో కష్టనష్టాలు తెలుసుకోవాలి



మన తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారు. మనం కూడా జీవితంలో కష్టనష్టాలు తెలుసుకోవాలి. అప్పుడే లవ్ చేయాలో.. వద్దో తెలుస్తుంది. గోల్డెన్ దశలో లవ్ పేరుతో మన జీవితాన్ని ఆగం చేసుకోవద్దు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చి వారు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలి.

– సురేష్, విద్యార్థి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల

కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకోవాలి



జీవితంలో మన కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకోవాలి. జీవితంలో మనం ఏదైనా సాధించినప్పుడే మనకు స్వాతంత్ర్యం వస్తుంది. అప్పుడు మన ప్రేమ పెళ్లి, పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవచ్చు. అప్పుడు పెళ్లికి ముందు లవ్ చేసినా ఇబ్బందులు ఉండవు.

– ప్రసన్న, విద్యార్థిని, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల

ఇంట్లో ఒప్పిస్తే బాగుంటుంది



జీవితంలో ఏదైనా సాధించాలంటే ఫస్ట్ బాగా చదువుకొని ఉన్నత స్థానంలో ఉండాలి. అప్పుడు లవ్ చేసినా ఇంట్లో పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే బాగుంటుంది. జీవితంలో సెటిల్ అయ్యాక లవ్ చేసి పెళ్లి చేసుకున్నా సమస్యలు రావు.

– భవ్య శ్రీ, విద్యార్థిని, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల

ఫ్యామిలీని సంతోషపెట్టాలి



ప్రేమ పెళ్లి అయినా, పెద్దలు కుదిర్చిన పెళ్లి అయినా ముందు తల్లిదండ్రులను, మన ఫ్యామిలీని సంతోషపెట్టాలి. అలా జరగాలంటే మనల్ని కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయొద్దు. కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. అప్పుడే వివాహం చేసుకుంటే మన ఫ్యామిలీ సంతోషపడుతుంది.

– గణేష్‌రెడ్డి, విద్యార్థి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల

మనసులు కలిసిన మనువు

- ప్రేమ వివాహాలు చేసుకుని సంతోషంగా జీవిస్తున్న జంటలు
- జీవితంలో నిలదొక్కుకుని పలువురికి ఆదర్శం

నేడు 'వాలంటైన్స్ డే'

ప్రేమించి పెళ్లి చేసుకోవడం ఒక భాగమైతే.. ఆ ప్రేమను నిలబెట్టుకుని జీవితాంతం కలిసి ఉండడం మరో భాగం. అన్నీ వాకబు చేసి పెద్దలు కుదిర్చిన పెళ్లిల్లు కూడా కొన్నిసార్లు విడిపోయిన సందర్భాలు ఉన్న ఈ రోజుల్లో ప్రేమించి.. పెద్దలను ఒప్పించి కొందరు.. స్నేహితుల తోడ్పాటుతో మరికొందరు ప్రేమ వివాహాలు చేసుకుని సుఖ సంతోషాలతో జీవితం గడుపుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

నీ మాటల మంత్రాలతో ఏదో మాయ చేసి నా మనస్సును దోచావు.. నీ చూపుల బాణాలతో గాలం వేసి మనసంతా నిండిపోయి నా గుండె చప్పుడు వయ్యావు.. నీ రాకతో నాలో వసంతాలు పూయించి నా అణువణువూ ఆక్రమించి నా ప్రాణమే నీవయ్యావు.. నా ధ్యాస నీవై, నా ఆశ నీవై, శ్వాస నీవై, ఆత్మ నీవై.. నువ్వు నేనూ ఏకమై రెక్కల హరివిల్లునెక్కి చేరిపోదామా మరో ప్రపంచంలోకి..

ఇదే కదా ప్రేమంటే!

పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుని..


నగేష్, మమత దంపతులు

బీబీనగర్ : బీబీనగర్ మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన జక్కి నగేష్, మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన మమతతో 2014లో భువనగిరిలోని ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో పరిచయం ఏర్పడింది. తర్వాత ప్రేమగా మారింది. విద్యార్థి సంఘం కార్యక్రమాల్లో కలిసి పని చేయడంతో ఒకరినొకరం అర్థం చేసుకున్నారు. ఇద్దరూ ఎంఏ, బీఈడీ పూర్తి చేశాక వివాహం చేసుకోవాలనుకున్నారు. పెద్దలను ఒప్పించి 2020లో వివాహం చేసుకున్నారు. పెద్దలు ఒప్పుకున్నప్పటికీ ఎలాంటి కట్న కానుకలు లేకుండా వివాహం చేసుకొని ఆదర్శంగా నిలిచారు. ఈరోజు ఇద్దరూ సంతోషంగా జీవనం గడుపుతున్నారు.

సమాజ సేవే ఒక్కటి చేసింది


ఏటి.కృష్ణ రాధిక దంపతులు

డిండి : మండల కేంద్రానికి చెందిన ఏటి.కృష్ణ, మహేశ్వరం రాధిక మనస్సులు సేవాభావంతో కలిసి పోవడంతో ఒకరినొకరు ప్రేమించుకున్నారు. వీరి కులాలు వేరుకావడంతో పెద్దలు పెళ్లికి ఒప్పుకోలేదు. కానీ భవిష్యత్‌లో సమాజానికి సేవ చేయాలనే పట్టుదలతో పెద్దలను ఎదిరించి 2015 మే 21న రంగారెడ్డి జిల్లా పరిగి సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో వివాహం చేసుకున్నారు. వివాహం జరిగిన సంవత్సర కాలం తర్వాత డిండికి వచ్చారు. అప్పటి నుంచి ఏ విషయంలోనైనా వారు ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకుంటూ సాఫీగా జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం స్థానికంగానే ఉంటూ కృష్ణ బీజేపీ దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్‌గా, రాధిక డిండి-1 ఎంపీటీసీగా కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

ఉద్యమం కలిపింది.. ఇద్దరిని


పిల్లలతో అనిల్, అనిత దంపతులు

మోత్కూరు : తెలంగాణ ఉద్యమం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులను ఒక్కటి చేసంది. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని మర్రి అనిల్, నర్సంపేట జిల్లా దూగొండి మండలం తోగ రామయ్యపల్లికి చెందిన ఉడుత అనిత ఎంఏ చదువుతూ.. పీడీఎస్‌యూ నాయకురాలిగా పని చేస్తున్న సమయంలో.. యూనివర్సిటీలో తెలంగాణ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడిగా ఉన్న అనిల్‌తో పరిచయం ఏర్పడింది. వారి పరిచయం ప్రేమగా మారింది. ప్రస్తుత తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్.. అనిత, అనిల్ పరిచయాలు, వీరి అతి చనువును తెలుసుకుని వారిని ఒక్కటి చేయాలని నిర్ణయించారు. వీరి ప్రేమ వివాహానికి అనిత తల్లిదండ్రులు అభ్యంతరం తెలుపడంతో ఎట్టకేలకు వారిని ఆమె ఒప్పించింది. హైదరాబాద్ మల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో 2015 జూన్ 15న వీరి వివాహం జరిగింది. ఇరువురి తల్లిదండ్రులతో పాటు బంధువులు హాజరయ్యారు. వీరి వివాహ ఖర్చులకు సీఎం కేసీఆర్ రూ.లక్ష అందజేశారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వివాహ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. యూనివర్సిటీ విద్యార్థి నేతలు, తెలంగాణ ఉద్యమ నాయకులు వీరి వివాహానికి హాజరయ్యారు. వివాహానికి ముందు అనిత 2013లో కొడకండ్ల మోడల్ స్కూల్‌లో టీచర్‌గా జాయిన్ అయి విధులు నిర్వహిస్తున్నారు. అనిల్ ప్రస్తుతం బీఆర్‌ఎస్ క్రియాశీలక రాజకీయాల్లో చురుకుగా పని చేస్తున్నారు. వీరికి పాప వేదాగ్రిని, బాబు అశ్విత్ సంతానం. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కేసులు, జైలు జీవితం అనుభవించి స్వరాష్ట్రంలో సరైన గుర్తింపు, పదవులు పొందలేక పోయామని తీవ్ర ఆవేదన, అసంతృప్తితో ఉన్నారు. అయినప్పటికీ పిల్లలతో జీవితాన్ని సంతోషంగా గడుపుతున్నామని అంటున్నారు ఈ దంపతులు.

పెద్దలను ఎదిరించి.. జీవితంలో గెలిచి


కుమారుడు, కుమార్తెతో అశ్విన్-శ్వేత దంపతులు

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన గజం అశ్విన్‌కుమార్-శ్వేత దంపతులు ప్రేమించి వివాహం చేసుకున్నారు. 21 సంవత్సరాల క్రితం తొలిచూపులోనే వీరి ప్రేమ మొదలైంది. కులాలు వేరు కావడంతో 2005 మే 27న వీరు కుటుంబసభ్యులను ఎదిరించి స్నేహితుల సహకారంతో వివాహం చేసుకున్నారు. వీరి వివాహం తర్వాత ఇరు కుటుంబ సభ్యుల నుంచి మాటలు, రాకపోకలు సైతం నిలిచిపోయాయి. ప్రస్తుతం అశ్విన్ తరపు కుటుంబ సభ్యులు దగ్గరైనా.. శ్వేత కుటుంబసభ్యులు మాత్రం ఇప్పటికీ దూరంగానే ఉన్నారు. 18ఏళ్ల క్రితం వివాహం చేసుకున్న వీరికి ప్రస్తుతం కుమారుడు హర్ష, కుమార్తె సరయూ ఉన్నారు. కుమారుడు 9వ తరగతి, కుమార్తె 7వ తరగతి చదువుతున్నారు. పెళ్లయిన కొత్తలో వీరి సంసారం ఒడిదుడుకుల నడుమ సాగింది. సంవత్సరంపాటు హైదరాబాద్, మరో సంవత్సరంపాటు నల్లగొండ జిల్లా చిట్యాలలో అద్దె ఇంట్లో ఉన్నారు. తర్వాత తిరిగి చౌటుప్పల్‌కు చేరుకుని శ్వేత బ్యూటీషియన్‌లో శిక్షణ తీసుకుంది. అనంతరం తనే సొంతంగా బ్యూటీ పార్లర్‌ను ఏర్పాటు చేసుకుంది. కొద్ది రోజుల తర్వాత బ్యూటీ పార్లర్‌కు అనుబంధంగా లేడీస్ ఎంపోరియం ఏర్పాటు చేశారు. ఈ రెండు దుకాణాలను భార్య చూసుకుంటుండగా భర్త దుకాణ వ్యవహారాలతోపాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారాలు కలిసిరావడంతో వీరి కుటుంబం ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరింది. ఈ జంట ఇటీవలే స్థానికంగా చక్కటి ఇంటిని కొనుగోలు చేసింది. ఎంతో అన్యోన్యంగా జీవనం సాగిస్తున్న ఈ దంపతులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

నమ్మకంలోనే నిజమైన ప్రేమ

నమ్మకంలోనే నిజమైన ప్రేమ ఉంది. మా తొలి చూపు నుంచి ఇప్పటి వరకు మా నడుమ ఎలాంటి మనస్పర్థలు రాలేదు. ఎంతో అన్యోన్యంగా ఉంటున్నాం. మా కుటుంబ సభ్యులు కోపంగా ఉన్న సమయంలోనూ అధైర్యపడలేదు. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నందున జీవితంలో గొప్పగా సాధించాలని అప్పుడే నిర్ణయించుకున్నాం. అనుకున్న మేరకు లక్ష్యాన్ని సాధించాం. ప్రస్తుతం మంచిగానే జీవనం సాగిస్తున్నాం. ఆర్థికంగానూ పెద్దగా సమస్యలేమీ లేవు.

– గజం అశ్విన్‌కుమార్ – శ్వేత, చౌటుప్పల్

ప్రేమకు పెద్దల ఆశీర్వాదం..


రమేశ్, సునిత దంపతులు

కొండమల్లేపల్లి : ఈ ఫొటోలో కనిపిస్తున్న దంపతులు వాసికర్ల రమేశ్, సునితారెడ్డి. వీరి ప్రేమకు వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో బీజం పడింది. నల్ల గొండకు చెందిన రమేశ్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో బంధువుల ఇంట్లో ఉంటూ 1994లో కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్‌లో చేసే సమయంలో తన జూనియర్ అయిన నిర్మల్‌కు చెందిన ఎంఏ తెలుగు చదువుతున్న సునితారెడ్డితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరి ప్రేమను మొదట పెద్దలు అంగీకరించలేదు. తర్వాత వారిని ఒప్పించి 1996, జూన్ 6న పెళ్లి చేసుకున్నారు. అనంతరం రమేశ్ కొండమల్లేపల్లిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పని పనిచేశారు. 2002 ఎస్‌జీటీగా ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం గుడితండాలో విధులు నిర్వహిస్తున్నాడు. కుమారుడు రాహుల్ రుషితో కలిసి ఆ దంపతులు సంతోషంగా జీనవం సాగిస్తున్నారు. ప్రేమకు పెద్దల ఆశీర్వాదం ఉంటే ఆ కుటుంబ జీవనం ఆనందమయం అవుతుందని చెబుతున్నాడు రమేశ్.

కలిసిన మనసులు


వేముల విక్రమ్-మమత దంపతులు

అర్వపల్లి : వారిద్దరూ రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. పెద్దలు అంగీకరించకపోయినా ఒక్కటై వివాహం చేసుకొని జీవితాన్ని సాఫీగా గడుపుతున్నారు. జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన వేముల విక్రమ్ హైదరాబాద్‌లో హెయిర్‌కటింగ్ సెలూన్‌ను నడుపుతూ మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయలపూర్ గ్రామానికి చెందిన మమతను ప్రేమించాడు. ఆమె బ్యూటీషన్‌గా పనిచేస్తూ విక్రమ్ ప్రేమను అంగీకరించింది. రెండేళ్లపాటు ఇద్దరు ప్రేమించుకున్నారు. వారిక పెళ్లిని ఇరుకుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. దీంతో 2022 మార్చి 24న వారు పెళ్లి చేసుకున్నారు. ఇప్పుడు విక్రమ్ సూర్యాపేట జిల్లా కేంద్రంలో హెయిర్ కటింగ్ సెలూన్‌ను నడిపిస్తున్నారు. మమత బ్యూటీషన్‌గా పని చేస్తోంది. ప్రస్తుతం ఇరు కుటుంబాల వారు కలిసిపోవడంతో వారి సంసారం సాఫీగా సాగుతోంది.

రాజీ ధోరణితో బంధం బలపడుతుంది



రాజీ ధోరణితోనే వివాహ బంధం బలపడుతుంది. మేము ఉత్తర భారతదేశానికి చెందిన వారము. మానాన్న ఉద్యోగ రీత్యా మేము హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. నేను ఉస్మానియా యూనివర్సిటీలో చదువుతున్న సమయంలో 25 సంవత్సరాల క్రితం మతాంతర వివాహం చేసుకున్నా. ఒకరికి కోపం వస్తే ఇంకొకరు తగ్గి ఉండడంతో మా బంధం బలంగా మారింది. స్థిరపడిన తర్వాత వివాహం చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– డాక్టర్ అపర్ణాచతుర్వేది, అధ్యాపకురాలు, ఉమెన్స్ డిగ్రీ కాలేజీ నల్లగొండ

క్లుప్తంగా

కల్నల్ సంతోష్ బాబు సేవలు మరువలేనివి


సంతోష్‌బాబు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తల్లాడ వెంకటేశ్వర్లు

సూర్యాపేట : దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన బిక్కుమళ్ల కల్నల్ సంతోష్ బాబు చేసిన సేవలు మరువలేనివని రిటైర్డ్ టీచర్ సంతోష్ బాబు మామ తల్లాడ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద గల సంతోష్ బాబు 39వ జయంతి సందర్భంగా కల్నల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం తెగించి ప్రాణ త్యాగం చేసి ఎందరో సైనికులను రక్షించారన్నారు. కార్యక్రమంలో తల్లాడ ఉమ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని గొర్రెల కాపరి మృతి

బీబీనగర్: బైక్ ఢీకొని గొర్రెల కాపరి మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీబీనగర్‌కు చెందిన గొర్రెల కాపరి బాలయ్య(65) రోజూలాగే తన మూగజీవాలను మేపేందుకు ఆదివారం ఉదయం వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో అతని కోసం బాలయ్య కుమారుడు రామాంజనేయులు వెతకగా బీబీనగర్ సమీపంలోని జాతీయ రహదారి పక్కన విగత జీవుడిగా పడి ఉండడాన్ని గుర్తించాడు. అనంతరం రామాంజనేయులు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. జనగామకు చెందిన శివ ద్విచక్రవాహనాన్ని అతి వేగంగా నడుపుతూ బాలయ్యను ఢీకొట్టడంతో మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి


రాజారావు (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి మండలం మామిడాల గ్రామానికి చెందిన దంతాలపల్లి రాజారావు (35) గత శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై మామిడాల నుంచి తిరుమలగిరికి వస్తుండగా వెలిశాల గ్రామ సమీపంలో కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యా యి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని తెలిపారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

పాలకవీడు: గూడ్స్ రైలు ఢీకొని మతిస్థిమితం లేకి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని జాన్‌పహాడ్ రైల్వే ఫ్లైఓవర్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన కొప్పుల వీరభద్రం(26)కు మతిస్థిమితం సరిగాలేదు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో అన్నవద్ద ఉంటూ పశువులను కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద ట్రాక్‌పై వీరభద్రంను గూడ్స్ రైలు ఢీకొన్నట్లు స్థానికులు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులు, రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేకుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఫ్లైఓవర్ వద్ద ఫెన్సింగ్, ప్రమాద హెచ్చరికలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

- హుజూర్‌నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి


జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్ట కామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హుజూర్‌నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి తెలిపారు. సోమవారం శివాలయంలో నిర్వహించిన రెనివేషన్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. జాతరకు నిర్వహించే ఎద్దుల పందేలకు కోటి రూపాయల ప్రైజ్‌లు అందిచనున్నట్లు తెలిపారు. ఇక్కడ జరిగే ఉత్సవాలకు విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఐటీ శాఖ ,పురపాలిక శాఖ మంత్రి కేటీఆర్ పాల్గొననున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఆయన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర ,ఎద్దుల పందేల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నూతన కమిటీ చైర్మన్ వర్రా వెంకటరెడ్డి, సర్పంచ్ శంకర్‌రెడ్డి, బాల వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయ శర్మ, నర్సింహారెడ్డి, జనిగ సైదులు, గురుస్వామి, సైదిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్చినాటికి ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం పూర్తి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన ఆయిల్‌పామ్ సాగులక్ష్యాన్ని మార్చినాటికి పూర్తి చేయాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి బెల్లంకొండ శ్రీధర్ గౌడ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో ఆయిల్ పామ్, డ్రిప్ కంపెనీల సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్ పామ్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి.యాదగిరి, ప్రాంతీయ ఉద్యాన అధికారులు కన్న జగన్, స్రవంతి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి


తిరుమలగిరిలో మాట్లాడుతున్న సోమయ్య

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టాలని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లగుండ్ల సోమయ్య కోరారు. సోమవారం తిరుమలగిరిలో మాదిగ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ బిల్లు ప్రవేశ పెడతామని చెప్పి తొమ్మిది సంవత్సరాలైనా హామీ అమలు చేయలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో జానకిరాములు, జాన్ విల్సన్, కృష్ణ, ప్రభాకర్, రమేష్, శ్యాం, గోపి, ఉపేందర్, సైదులు, పర్వతాలు, నాగయ్య, యాదయ్య పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు

తుంగతుర్తి: సుకన్య సమృద్ధి యోజనను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వడ్లమూడి వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవడంలో సూర్యాపేట జిల్లా లక్ష్యాన్ని మించి ముందజంలో ఉందన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా సూర్యాపేట డివిజన్ పరిధిలో సుకన్య సమృద్ధి పథకంపై ఈనెల9, 10 తేదీల్లో ప్రత్యేక డ్రై వ్ నిర్వహించి 1,615 ఖాతాలు తెరవాలని లక్ష్యంగా పెట్టుకోగా జిల్లాలోని పోస్టల్ సిబ్బంది సహకారంతో రెండు రోజుల్లో 1,652 ఖాతాలు తెరిచినట్లు తెలిపారు. దేశంలో ఏ పథకానికి లేని విధంగా సుకన్య సమృద్ధి యోజన ఖాతాకు 7.6శాతంతో వడ్డీ లభిస్తుందన్నారు.

చికెన్ వ్యర్థాల తరలింపు వాహనం పట్టివేత

బీబీనగర్: హైదరాబాద్ నుంచి ఏపీకి చికెన్ వ్యర్థాలను రవాణా చేస్తున్న వాహనాన్ని బీబీనగర్ పోలీసులు ఆదివారం రాత్రి గూడూరు టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీకిలోని అద్దంకికి చెందిన ఘంటసాల సూరి, ఏలూరుకు చెందిన బాలే నాగరాజు, మెగ్గ దుర్గారావు, ఘంటసాల వెంకన్నబాబులు హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టకు చెందిన సయ్యద్ ఇర్ఫాన్ మద్దతుతో చికెన్ వ్యర్థాలను లోడ్ చేసుకొని గూడూరు టోల్‌ప్లాజా గుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలిస్తున్నారు.సమాచారం మేరకు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తహసీల్దార్‌పై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

ఆలేరురూరల్ : ఆలేరు తహసీల్దార్ రామకృష్ణ కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై ఎలాంటి అనుమతులు ఇవ్వకుండా దాదాపు 200 ట్రాక్టర్ ఇసుకను అక్రమంగా తరలించి సమీకృత మార్కెట్ ముందు డంపింగ్ చేశారని బీజేపీ నాయకులు బందెల సుభాష్, వడ్డెమాన్ కిషన్ సోమవారం కలెక్టరేట్‌లో ఏఓ నాగేశ్వరావుకు ఫిర్యాదు చేశారు. ఇసుక డంపింగ్‌పై ఆర్‌టీఐపై ఫిర్యాదు చేసి 2 నెలలు గడిచినా ఇంతవరకు సమాచారం ఇవ్వలేదన్నారు.

ఆలయంలో చోరీ

భువనగిరి : గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పట్టణ శివారులోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం జరిగింది. ఆలయం ఈఓ, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియన వ్యక్తులు హుండీని పగుల గొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం స్థానికులు గమనించి నిర్వాహకులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ పుటేజీలను పరిశీలంచడంతో ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడుతున్నట్లు కనిపించింది. 40 రోజులకు సంబంధించి భక్తులు సమర్పించిన నగదు సుమారు రూ. 2 లక్షలు, అర కిలో వెండి, 5 గ్రాముల బంగారం అపహరణకు గురైనట్లు తెలిపారు.

తెలంగాణలో బీజేపీకి పతనం తప్పదు


టేకుమట్ల వద్ద జాతీయ రహదారి దిగ్బంధం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సూర్యాపేట రూరల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించకుండా మోసం చేస్తున్న బీజేపీకి తెలంగాణ రాష్ట్రంలో పతనం తప్పదని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మందకుమార్ మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ హెచ్చరించారు. మాదిగ ఉపకులాలను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మహాజన షోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్న మాదిగ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని టేకుమట్ల వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే 100రోజుల్లో ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చింతలపాటి చిన్నశ్రీరాములు, బొజ్జ సైదులు, మందరాజు, నరసన్న, మహేందర్,విజయ, రవి, వెంకన్న పాల్గొన్నారు.

పంచాయతీలో 'రేషన్'

నాంపల్లి : గ్రామ పంచాయతీ భవనం రేషన్ దుకాణంగా మారింది. మండలంలోని ముష్టిపల్లి పంచాయతీ భవనంలో ఎలాంటి అనుమతులు లేకుండా రేషన్ దుకాణం ఏర్పాటు చేశారు. పంచాయతీలో కార్యదర్శి, సర్పంచ్‌కు సరిపడా గదులు లేక రికార్డులు, బీరువాలు, ఫర్నిచర్ ఉంచడానికి ఇబ్బందిగా ఉండగా.. అదే కార్యాలయంలో రెండేళ్లుగా రేషన్ దుకాణం ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రేషన్ దుకాణం వేరే భవనంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పంచాయతీ కార్యాలయంలో నడుస్తున్న రేషన్ దుకాణం

అదానీ కుంభకోణాలపై విచారణ జరిపించాలి


ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నల్లగొండ టౌన్: అదానీ కుంభకోణాలపై వెంటనే విచారణ జరిపించాలని, దేశ ఆర్థిక సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ జాతికి క్షమాపణ చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ఆ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రధాని మోదీ అండదండలతో ప్రపంచంలోనే రెండవ కుబేరుడిగా అదానీ ఎదిగారని అన్నారు. ఎల్‌ఐసీని రూ.40 వేల కోట్ల నష్టాల్లోకి నెట్టివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, పల్లా దేవేందర్‌రెడ్డి, పబ్బు వీరస్వామి, బొలుగూరి నర్సింహ, బంటు వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు, అంజాచారి, గిరి, రాము, మైనుద్దీన్, బరిగల వెంకటేష్, నూనె రామస్వామి, ఎండీ.జహంగీర్, చాపల శ్రీను పాల్గొన్నారు.

ప్రారంభానికి భవనాలను సిద్ధం చేయాలి

భువనగిరిటౌన్ : ప్రారంభానికి భవనాలను సిద్ధం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. సోమవారం భువనగిరి పట్టణంలోని నూతనంగా నిర్మిస్తున్న వెజ్‌నాన్ వెజ్ సమీకృత మార్కెట్ భవనం, జిల్లా గ్రంథాలయ సంస్థ భవనం, 9వ వార్డులోని కమ్యూనిటీ హాల్ భవనం, నిరాశ్రయుల వసతి భవనం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.నాగిరెడ్డి, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి అండాళు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.